## మినీ కథలు:

# విలువ



"దర్గాకళామందిర్" ఆకాశంలో మెరిసే తారలనే ధిక్కరిస్తున్నట్లుగా తీవిగా వెలుగుతున్న రంగురంగుల బల్బుల తోరణాలతో పెళ్ళివారిని ఆహ్వానిస్తూంది. పెళ్ళికొడుకు రమేష్ డాక్టరు చదివాడు. పుష్పక విమానంలాంటి కారు ఒకటి రయ్యిని గేటు లోపలికి వచ్చి ఆగింది. లక్ష్మీపతి దంపతులు అందులోనుంచి తీవిగా దిగారు. రెండో అంతస్థులో స్నేహబృందంతో ఉన్న రమేష్ వారిని చూసి రెండేసి మెట్లు దాటుతూ ఎదురెళ్ళి చిరునవ్వుతో సగౌరవంగా వారిని ఆహ్వానించాడు. సరిగ్గా అదే సమయంలో వచ్చాడు చలపతి. అందరిచూపులూ వారిమీదే నిలిచాయి.

"వీరు మా మేనమామ. పేరు లక్ష్మీపతి. ఎక్జిక్యూటివ్ ఇంజనీరు. ఈమె మా అత్తయ్య. ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు." అంటూ తన స్నేహితులకు పరిచయం చేశాడు రమేష్. వారిని ఎరిగున్న బంధువులు కూడా దగ్గరికొచ్చి మాట కలిపారు. అలా అంచెలంచెలుగా పెళ్ళికి విచ్చేసిన అతిథులందరికీ ఈ విషయం తెలిసిపోయింది. పెళ్ళికొడుక్కి స్వయానా మేనమామట. అతడు ఇంజనీరు. ఆమె ప్రిన్సిపాలట. అలా వారి సంపాదనను. హోదాని గురించి చెప్పుకుంటున్నారు. అవన్నీ మరో వ్యక్తి కూడా వింటున్నాడు. చూస్తున్నాడు. అతను చలపతి. అలా చెప్పుకుంటున్నవారు ఠక్కున మాటలాపి మరీ చూస్తున్నారు. మరో క్రొత్త మనిషిని చూసి అనే కంటే అతని నీరుకావిరంగు బట్టలు చూసి అంటే బాగుంటుందేమో! ఆ బట్టలు అతని పేదరికాన్ని చాటి చెప్పున్నాయి. చుక్కల్లో చంద్రుడిలా అందరిలోనూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న లక్ష్మీపతి అందరి చూపులకూ ఉక్కిరి బిక్కిరి అవుతూనే మరింత తీవిని ప్రదర్శించాడు. దర్జాగా ఖరీదైన బట్టల్లో వున్న లక్ష్మీపతి ముందు తనో దిష్టిబొమ్మలాగ ఫీలవుతూ అందరి చూపులకు ఉక్కిరి బిక్కిరి అవుతూ సిగ్గుతో తల వంచాడు చలపతి.

ఈ సంఘంలో బాగా డబ్బున్న వాడయినా యిబ్బందే. లేనివాడయినా యిబ్బందే. జనం లక్ష్మీపతినీ. చలపతినీ ఇద్దర్నీ కూడా ఆశ్చర్యంగానే చూశారు. కానీ ఆ చూపుల్లో ఎంతో తేడా వుంది.

బిక్కు బిక్కుమంటూ పెళ్ళి కొడుకు దగ్గరకు వెళ్ళిన చలపతిని చూసి ముఖం చిట్లించారు పెళ్ళికొడుకూ. లక్ష్మీపతి.... అతని పేదరికం తమ కెక్కడ అంటుకుంటుందో నన్న భయంవల్లనేమో, అతన్ని ఎరిగున్న బంధుజనం కూడా చూసీ చూడనట్లు నటించారు.

పెళ్ళికొడుకు స్నేహితులు "ఆయన ఎవరని...." అతనిని ప్రశ్నించనూలేదు. "ఫలానా...." అని పెళ్ళికొడుకు అతనిని పరిచయం చేయనూలేదు. చదువు మనిషిలో సంస్కారాన్ని పెంచుతుందంటారు. కానీ, రమేష్‌లాంటి చదువుకున్న యువకులలో అది ఎంతవరకు నిజం? ఏది ఏమైనా నేటి సంఘంలో డబ్బుకీ. హోదాకీ ఉన్న విలువ మనిషికీ. మనసుకీ లేదు. అనుకొంటూ ఇంక అక్కడ నిలబడలేక సంఘంలో తనకున్న స్థానమేమిటో తెలిసీ తానక్కడికొచ్చినందుకు తనలోతానే తిట్టుకొంటూ బయటికొచ్చి. రోడ్డుమీద నిలబడ ఇంద్రభవనంలా వెలిగిపోతున్న ఆ భవనంవేపూ. అందులో తిరుగుతున్న ఖరీదైన మనుషులవైపూ చూశాడు. కళ్ళు జిగేలుమన్పించే ఆ లైట్ల తోరణాలు తననూ. తన పేదరికాన్ని చూసి ఫక్కున నవ్వుతున్నట్లు ఫీలవుతూ దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు పెళ్ళికొడుక్కి స్వయాదా మరో మేనమామ అయిన చలపతి.

— అక్కినేని లక్ష్మీఅన్నపూర్ణ

★

"అమ్మా! బిచ్చం తల్లీ!"

వీధి వరండాలో కూర్చుని ఎనిమిదేళ్ళ నానిగాడికి పాఠాలు చెబుతున్న విశ్వనాథం చిరాగ్గా చూశాడు.

"ఇప్పుడేం వీల్లేదు.. అలా వెళ్ళవోయ్" అన్నాడు.

"ధర్మ పెబువులు కనికరించాల."

"చెబుతుంటే నీక్కాదూ, వెళ్ళు.... వెళ్ళు.... ప్రతీరోజూ ఇదొక న్యూసెన్స్ అయిపోతోంది."

వాడు వెళ్ళిన ఐదు నిముషాలకు మరొకడొచ్చాడు.

"బాబూ! ధర్మం చేయించండి బాబూ"

మళ్ళీ చిరాగ్గా తలెత్తి చూసి "ఈ రోజుల్లో ప్రతీవాడికి ఇదొక అలవాటైపోయింది. ఒళ్ళొంచి పని చెయ్యలేక ముష్టికి బయలుదేరుతున్నారు. ఇదొక పెట్టుబడిలేని లాభసాటి వ్యాపారంలా తయారైంది. దుక్కలాగున్నావ్ ఎక్కడైనా పని చేసుకోరాదూ?"

"ఏదైనా పనిప్పించండి బాబయ్యా."

"పైగా ఇదొకటా? ముష్టికోసం రోజూ సవాలక్షమంది వస్తుంటారు. వచ్చిన ప్రతీ వాడికి పనిప్పిస్తూ కూర్చోడానికి ఇదేమైనా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ అనుకున్నావా?"